క్లుప్తంగా

స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని జాగృతి రాష్ట్ర నాయకులు కేర్ కళాశాలల అధినేత నరాల సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మొదటి మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. యూఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం విద్యార్థుల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేస్తూ అనేక సమస్యల్ని పరిష్కరించే రకంగా కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, ప్రతినిధులు చంద్రశేఖర్, చందర్రావు, పెద్ది సూరి, బాదం తిరుపతి, సిద్ధల నాగరాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కోయడ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



సుభాష్‌నగర్: నగరంలోని గాంధీగంజ్‌లోగల రిటైల్ కూరగాయల వర్తకుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు నిజామాబాద్ ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ ముప్ప గంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పలు సమస్యలను విన్నవించారు. చైర్మన్ ముప్ప గంగారెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కూరగాయల మార్కెట్ రిటైల్ వర్తకుల సంఘం అధ్యక్షుడు లింగం, ప్రధాన కార్యదర్శి కండ్లకోయ ప్రసాద్, నాయకులు సత్యనారాయణ, సలీం, గోవర్ధన్, సాయిలు, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెయూలో 77వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని (జాతీయ విద్యార్థి దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందూర్ విభాగ్ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే జాతీయ వాదం కోసం పని చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని అన్నారు. నాయకులు శివ, శశి, అమతచారి, సాయికుమార్, నవీన్, అనిల్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అలవర్చుకోవాలి

డిచ్‌పల్లి: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ సూచించారు. మండల కేంద్రం శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల సమావేశం, ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ సవిత, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాల, వినీత్, దేవి మేరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ధర్పల్లి: మండలానికి చెందిన బీజేవైఎం సీనియర్ నాయకులు ఎజ్జ శ్రీకాంత్, వినయ్ చారి, నిమ్మల వినయ్‌గౌడ్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై దాడి చేస్తే కఠిన చర్యలు

ఖలీల్‌వాడి: సంఘ విద్రోహశక్తుల పేరిట చందాల కోసం విద్యాసంస్థలపై ఒత్తిడి చేసి పాఠశాలల నిర్వహణలో ఆటంకం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ సాయి చైతన్య హెచ్చరించారు. కొందరు దౌర్జన్యంగా పాఠశాలలోకి ప్రవేశించి అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన సమాచారం తమ వద్ద ఉందని తెలిపారు. చందాల కోసం విద్యాసంస్థలపై దాడులు చేసిన వారి సమాచారం డయల్ 100, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 59777, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08462- 226090లకు తెలపాలన్నారు.

గాంధీచౌక్‌లో ఆక్రమణల తొలగింపు

- ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడటంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



ఆక్రమణలను తొలగించడంతో విశాలంగా మారిన రోడ్డు



గాంధీచౌక్‌లో రోడ్డుపై ఉన్న షెడ్లను తొలగిస్తున్న సీఐ ప్రసాద్

ఖలీల్‌వాడి: నగరంలోని రోడ్లపై ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలో ప్రధాన కూడలైన గాంధీ చౌక్‌లో ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ, సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. వాహనాదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగించే బోర్డులను, తోపుడు బండ్లతోపాటు షెడ్లను తొలగించారు. గాంధీచౌక్ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ నుంచే పాత గంజ్‌కు, హోల్‌సేల్ కిరణాషాపులు, బంగారు దుకాణాలు, వస్త్రదుకాణాలు, మహిళలకు అలంకరణ వస్తువులు ఎక్కువగా ఇక్కడే లభిస్తాయి. దీంతో జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా గాంధీచౌక్‌కు వస్తుంటారు. దీంతో ఎప్పుడు ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ప్రాంతంలో వ్యాపారులు రోడ్డును అక్రమించుకోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కావడంతో ట్రాఫిక్ పోలీసులు రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

విశాలంగా మారిన రోడ్డు..

నగరంలోని గాంధీచౌక్ నుంచి పాత గంజ్‌లోకి వచ్చే రోడ్డుపైన తోపుడు బండ్లు, రోడ్డును ఆక్రమించుకొని షెడ్లతోపాటు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. దీంతో పాత గంజ్‌కు వచ్చే గూడ్స్ వాహనాలను రాత్రి వేళల్లో అనుమతి ఇస్తున్నారు. గంజ్‌లోకి టూ వీలర్లను అనుమతి ఇవ్వడంతోపాటు అక్కడి సిబ్బంది బైక్‌లను లోనికి అనుమతి ఇస్తున్నారు. దీంతో ట్రాఫిక్ తగ్గిపోయింది. దీంతోపాటు షాపుల ముందు ఉండే వాహనాలను గంజ్‌లో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు విశాలంగా కనబడుతుంది. దేవిరోడ్డు, గంజ్‌రోడ్డుల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డుపైన పెట్టిన వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు చలాన్‌లు వేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడంతో వాహనాదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం..

సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తాం. రోడ్డును అక్రమించిన షాపులు, తోపుడు బండ్లను లేకుండా చేస్తాం. రోడ్డుపైన షాపులు, వాహనాల పార్కింగ్ లేకుండా ఉంటే రాకపోకలు సులభంగా జరుగుతుంది. ఈమేరకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీంతోపాటు గాంధీ చౌక్ వద్ద ట్రాఫిక్ స్టాపర్లు ఏర్పాటు చేశాం.

–ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

నేటి చిత్రం

గుంతల రోడ్డుపై వెళ్లేదెలా?

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామంలో ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు గుంతలను గమనించక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని స్వాగత రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

–గణేష్, కంజర్ గ్రామం



కంజర్ స్వాగత రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

విద్యార్థుల సంఖ్యను పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

సిరికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠాలు ఎలా బోధిస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాంలు అందించారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాల గురించి ఆరా తీశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సీత్లాదేవి వేడుకలు



మద్దుల్ తండాలో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న గిరిజన మహిళలు



పాకాలలో పూజలు చేస్తున్న గిరిజనులు



నల్లగుట్ట తండాలో..

ధర్పల్లి/సిరికొండ/జక్రాన్‌పల్లి: రూరల్ నియోజకవర్గంలోని పలు తండాల్లో మంగళవారం సీత్లాదేవి ఉత్సవాలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా పశు సంపద సంరక్షణ, సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ గిరిజనులు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో వచ్చే పెద్ద పుష్య కార్తె మొదటి లేదా రెండో మంగళవారంలో ఈ పండుగను జరుపుకుంటారు. పండుగ సందర్భంగా గిరిజనులు మేరీమా, తుల్జా, మాత్రల్, కేంఖాళీ, హింగా, ద్వాలంగర్, సీత్లా మాతల ప్రతిమాలను తండా సమీపంలోని చెరువు గట్ల మీద ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జొన్న, పప్పు ధాన్యాలతో తయారుచేసిన ఘుంగ్రి అనే పదార్థాన్ని అమ్మవారికి నైవేద్యంగా యువతులు సమర్పించారు. అనంతరం మేకలను, గొర్రెలను బలి ఇచ్చి వాటిపై నుంచి వివిధ జాతుల పశువులను దాటించారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ



ఎస్సై రామకృష్ణ , కల్యాణి

సిరికొండ/ధర్పల్లి: సిరికొండ పోలీస్ స్టేషన్ ఎస్సైగా రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సిరికొండ పీఎస్‌కు తొలిసారిగా కేటాయించబడిన మహిళా ఎస్సై కళ్యాణిని ఉన్నతాధికారులు ఒక్క రోజులోనే ధర్పల్లి పీఎస్‌కు బదిలీ చేశారు. అక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను సిరికొండకు బదిలీ చేశారు. అలాగే ధర్పల్లి పోలీస్ స్టేషన్ ఎస్సైగా కల్యాణి బాధ్యతలు స్వీకరించారు.

డిచ్‌పల్లి ఎంపీడీవోగా రాజ్‌వీర్..



డిచ్‌పల్లి: లోకసభ ఎన్నికల వేళ కామారెడ్డి నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండల ఎంపీడీవోగా బదిలీపై వెళ్లిన కే రాజ్‌వీర్ తిరిగి నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చారు. డిచ్‌పల్లి ఎంపీడీవోగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న బుక్య లింగంనాయక్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రాజ్ వీర్‌కు మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

తెయూ (డిచ్‌పల్లి): భూమి సంబంధిత చట్టాలు, పన్నుల సూత్రాలపై న్యాయ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్, జిల్లా రిటైర్డ్ జడ్జి నర్సింహాచార్యులు సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహాచార్యులతోపాటు మరో రిసోర్స్ పర్సన్, జిల్లా రిటైర్డ్ జడ్జి జీవీ సుబ్రమణ్యం చట్టాల ప్రాధాన్యత, వాటిని అమలులో తలెత్తే సమస్యలపై న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్, హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్నరాణి, డాక్టర్ స్రవంతి, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ నాగజ్యోతి, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డ్రంకెన్‌డ్రైవ్‌లో 12 మందికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతూ 26 మంది పట్టుబడినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పట్టుబడిన వారికి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జుడిషియల్ 2వ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ నలుగురికి ఒక రోజు, నలుగురికి రెండు రోజులు, నలుగురికి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మరో 14 మందికి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని వృద్ధురాలు (60–65) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఈ నెల 6న మధ్యాహ్నం రైల్వేస్టేషన్ రేకులషెడ్డు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధురాలిని పోలీస్ సిబ్బంది 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఏమైనా సమాచారం తెలిస్తే వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్ల బదిలీ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ అధికారులను మంగళవారం అంతర్గత బదిలీలు చేశారు. నగరంలోని 5 జోన్లలో పనిచేస్తున్న ఏఈలు, డీఈలను పరస్పర మార్పులు చేర్పులు చేస్తూ, వెంటనే విధుల్లో చేరాలని కమిషనర్ దిలీప్ కుమార్ సర్క్యులర్ జారీచేశారు.

జోన్–1: డీఈ జె.ప్రదీప్ కుమార్, ఎస్.భూమేశ్వర్‌లను సంయుక్త కలెక్టరేట్, డివైడర్ పనులను కేటాయించారు.

జోన్–2: డీఈ చిటికెల సుదర్శన్‌రెడ్డి, ఎస్.పావనిలకు అమృతమిత్ర, వనమహోత్సవం, నర్సరీల నిర్వహణను కేటాయించారు.

జోన్–3: డీఈ ముస్తాక్ అహ్మద్ ఖాన్, సయ్యద్ వాజిద్‌లను ట్యాంక్‌బండ్ నిర్వహణ అప్పగించారు.

జోన్–4: డీఈ చిటికెల సుదర్శన్‌రెడ్డి, మొహియుద్దీన్ సల్మాన్‌లను బల్దియా కార్యాలయం, రాజీవా గాంధీ ఆడిటోరియం, నుడా, అంబేడ్కర్ భవన్ మెయింటెనెన్స్, శానిటరీ మెటీరియల్స్ నిర్వహణ

జోన్–5: డీఈ ముస్తాక్ అహ్మద్ ఖాన్, సయ్యద్ ఇనాయత్ కరీం అలీసాగర్ ఫిల్టర్ బెడ్, మోపాల్ ఫిల్టర్‌బెడ్, ఖిల్లా ఫిల్టర్‌బెడ్, డంపింగ్‌యార్డు, మున్సిపల్ వాహనాల మెయింటెనెన్స్ అప్పగించారు.

బీఎల్‌వోలకు శిక్షణ

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆర్‌ఐ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ దామోదర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలి



పాంగ్రాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్



మోపాల్‌లో ఉత్తమ మహిళలను సన్మానిస్తున్న అధికారులు

నిజామాబాద్‌రూరల్/మోపాల్/డిచ్‌పల్లి/ఇందల్వాయి: మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో మంగళవారం మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. రూరల్ మండలంలో పాంగ్రా శివారులోని మండల సమాఖ్య భవనంలో డీఆర్‌డీవో మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా పురోగతి చెందిన మహిళలను డీఆర్‌డీవో ప్రత్యేకంగా సన్మానించారు. మహిళా స్వశక్తి సంబురాలు బుధవారం నుంచి ఈనెల 16 వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు. మోపాల్ మండలంలోని పలు గ్రామాల్లో స్వయం ఉపాధి అవకాశా లతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న మహిళా సంఘాలలోని మహిళలను మండల సమాఖ్య కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ గోవింద్‌రావు, ఎంపీడీవో రాములు నాయక్ సన్మానించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీఎం సంధ్యరాణి హాజరై మాట్లాడారు. ఇందల్వాయి మండల కేంద్రంలో నిర్వహించిన మహిళా సమాఖ్య ప్రత్యేక సమావేశంలో గత సంవత్సరం చేసిన పనులు, ప్రస్తుత సంవత్సరం చేయవలసిన పనులపై సభ్యులు, అధికారులు చర్చించారు. ఐబీ డీపీఎం సంధ్య రాణి, ఆయా మండలాల ఏపీఎంలు, ఎంఎస్‌వోబీ, సీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న డీపీఎం సంధ్యారాణి

వైఎస్సార్‌కు ఘన నివాళి



డిచ్‌పల్లిలోని సాక్షి యూనిట్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న మేనేజర్ మహేష్, సిబ్బంది



నగరంలో వైఎస్సార్ అభిమాని భిక్షపతి ఆధ్వర్యంలో..



తొర్లికొండలో..

సాక్షినెట్‌వర్క్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని మంగళవారం నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఈ–నామ్ అమలు తీరు పరిశీలన

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఈ–నామ్ అమలు తీరును రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చందర్‌రావు బృందం పరిశీలించింది. ఈ–నామ్ అమలు, డబ్బుల చెల్లింపు, నాణ్యత పరిశీలన, తదితర వివరాలను ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణను అడిగి తెలుసుకున్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ప్రమోషన్



ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని 8మంది హెడ్‌కానిస్టేబుళ్లు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన సిబ్బంది మంగళవారం సీపీ సాయిచైతన్యను కలిశారు. ప్రమోషన్ పొందిన ఎండీ రియాజుద్దీన్, కే పరమేశ్వర్, పీ వసంత్ రావు, జక్రయ్య, కే అరుణ కుమారి, జీ అనురాధ, జీవీ రమణేశ్వరి, ముంతాజ్ బేగంకు సీపీ శుభాకాంక్షలు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,700	వెండి(కిలో)	1,11,500
22 క్యారెట్స్	90,187		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	క్యాప్సికం	50	90
బెండకాయ	50	80	గాజరుగడ్డ	30	60
బీరకాయ	50	80	పచ్చిమిర్చి	50	80
దొండకాయ	30	60	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	80	120	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిగడ్డ	20	40
వంకాయ	40	60	గోబిపువ్వు	50	80
పాలకూర	30	50	బీట్‌రూట్	30	60
మెంతికూర	50	80	కరివేపాకు	40	60
కొత్తిమీర	30	50	చామగడ్డ	35	60
పుదీనా	60	90	చిక్కుడుకాయ	45	75

–సుభాష్‌నగర్

సంక్షిప్తం

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

సిరికొండ/మోపాల్/నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా బుధవారం చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు పలు మండలాల్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. సిరికొండలో టీయూసీఐ ఆధ్వర్యంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందచేశారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం



నిజామాబాద్ సిటీ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిన్నబుబ్బ రాంభూపాల్ పటేల్‌ను మంగళవారం జిల్లాకేంద్రంలో ఇందూరు పటేల్ బ్రదర్స్ సంఘ సభ్యులు సన్మానించారు. సంఘ నాయకులు బొబ్బిలి నరసయ్య, న్యాలం రాజు, శేఖర్, కిషన్‌రెడ్డి, బాలకిషన్, కోర్వ నరసయ్య, బాసెట్టి సురేష్, బంటు ప్రశాంత్, తోట రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందల్వాయి ఎస్సైని కలిసిన మేస్త్రీలు

ఇందల్వాయి: ఇందల్వాయి ఎస్సై సందీప్‌ని మంగళవారం మండల భవన నిర్మాణ రంగ మేస్త్రీలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘ ప్రతినిధులు జగన్నాథరెడ్డి, ప్రసాద్, నాగార్జున, రమణ, అంజి ఉన్నారు.

నిధులను విడుదలచేయాలి

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు మంజూరుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులను ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అంతర్జాతీయ సదస్సులో డా. విశాల్ ప్రసంగం



నిజామాబాద్‌నాగారం: బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ నగరంలో ఇటీవల నిర్వహించిన బ్రిటిష్ ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ (బీఐపీఏ) వార్షిక సదస్సులో జిల్లాకు చెందిన మా నసిక ఆరోగ్య నిపుణుడు, ప్రభుత్వ వైద్య కళాశాల సైకియాట్రీ విభాగాధిపతి విశాల్ ఆకుల ఫ్యాకల్టీ మెంబర్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో 'ముందుకు వస్తున్న కొత్త వ్యసనాల ధోరణులు' అనే అంశంపై ఆయన ప్రసంగం చేశారు.

క్రికెట్ మ్యాచ్ వర్షంతో డ్రా

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా క్రికెట్ జట్టు– కృష్ణమూర్తి జట్టు మధ్య రెండు రోజుల మ్యాచ్ జరుగగా మంగళవారం రెండో రోజు వర్షం కారణంగా మ్యాచ్ డ్రా అయినట్లు నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట రెడ్డి వెల్లడించారు. కృష్ణమూర్తి జట్టు మొదట 5వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసింది. అనంతరం నిజామాబాద్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 238 పరుగులు చేయగా, వర్షం కారణంగా ఎంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు.